క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



జఫర్‌గఢ్: మండలంలోని రేగడితండా శివారు టీబీతండాలోని 'మా ఇల్లు' ప్రజాదరణ అనాథ ఆశ్రమానికి తాళ్లపల్లి జనార్దన్ కుమార్తె పల్లె రోహిణి ఇంద్రకుమార్ పెళ్లి రోజును పురస్కరించుకొని నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అనాథ పిల్లల సమక్షంలో వేడుకలు జరుపుకున్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు గాదె పుష్ప, ఆశ్రమ పిల్లలు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

దేవరుప్పుల: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మద్యం తీసుకెళ్తున్న పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కామారెడ్డి గూడెం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సీర్మాలకు చెందిన చింతల రవీందర్‌రెడ్డి, రాజు, సింగారపు నర్సింగరావు కలిసి 12 ఫుల్‌బాటిళ్లు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

'ఎదుగుదల చూసి ఓర్వలేక దాడులు'



బచ్చన్నపేట: బీజేపీలో తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. సోమవారం మండలంలోని తమ్మడపల్లిలో ఆయన మాట్లాడారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన అమిత్ షా సమావేశంలో పలువురు పార్టీ నాయకులు వెనుకాల నుంచి దాడులు చేశారని, తాను ముందుకు తిరగగానే తప్పించుకు పారిపోయారని తెలిపారు. పార్టీని గెలిపించే సత్తా, అభివృద్ధి చేసే శక్తి ఉన్న తనకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక పలువురు ఆపే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పార్టీలో విభేదాలు తలెత్త కూడదని అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలతో కలిసి పని చేస్తానని చెప్పారు. వెన్నుపోటు రాజకీయాలు చేయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



రఘునాథపల్లి/చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ శ్రేణులు పలు గ్రామాల నుంచి ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో వేలాదిగా సభకు తరలి వెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో పాగాల సంపత్ రెడ్డి, శ్రీధర్‌రావు, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, మారుజోడు రాంబాబు, బొల్లం అజయ్, వారాల రమేష్, పోకల శివకుమార్, నామాల బుచ్చయ్య, మల్కపురం లక్ష్మయ్య, సురేందర్ రెడ్డి, ఎడవెల్లి కృష్ణారెడ్డి, సరితబాలరాజు ఉన్నారు.

నేడు ఘన్‌పూర్‌కు తీన్మార్ మల్లన్న రాక

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిర ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక శివాజీ చౌక్ వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ తీన్మార్ మల్లన్న హాజరవుతున్నారని మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆందోళన.. హర్షం

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లు శివారులో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. నియోజకవర్గానికి ఇంకా రిజర్వాయర్లు కావాలి, అందులో చిల్పూరు మండలం లింగంపల్లి అనగానే గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న కడియం శ్రీహరి సీఎం వద్దకు వెళ్లి చెవిలో చెప్పడంతో ఇక లింగంపల్లిలో రిజర్వాయర్ అవసరం లేదని చెప్పడంతో హర్షం వ్యక్తం చేశారు.

జీవన్ ప్రమాణ్ పత్రాల నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో దివ్యాంగులైన పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలను సంఘం ముఖ్య నాయకుల పర్యవేక్షణలో సోమవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా



గురువన్నపేటలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మహిళలకు దండం పెట్టి ఓటు అభ్యర్థిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- స్థానికేతరులకు బుద్ధి చెప్పాలి
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తపాసుపల్లి, గురువన్నపేట, పోసాన్‌పల్లి, అయినాపూర్, కిష్టంపేట, గౌరాయపల్లి, మర్రిముచ్చాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టో అమలు చేస్తామన్నారు. గతంలో స్థానికేతరుడైన ముత్తిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. స్థానికేతరులకు బుద్ధి చెప్పి స్థానికుడినైన తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూ కబ్జాదారుడని.. అతడి అనురాగ్ యూనివర్సిటీ కోసం 500 మంది నుంచి ప్లాట్లు గుంజుకున్నాడని విమర్శించారు. తాను గతంలో చేర్యాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈప్రాంతానికి తపాస్‌పల్లి రిజర్వాయర్ కోసం రూ.1,000 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడితే దానిని ఓర్వలేని మంత్రి హరీశ్‌రావు కొండపాక, నంగునూరు మండలాలకు అక్రమంగా కాల్వలు తవ్వుకొని నీరు తరలిస్తున్నారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆ కాల్వలను పూడ్చివేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న కేసీఆర్.. సీఎం అయిన తర్వాత నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. దొరల భూములు రక్షించేందుకే ధరణిని తీసుకొచ్చారన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు 500 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింగరావు, మాజీ ఎంపీపీ పరమేశ్వర్, ఆగంరెడ్డి, మహాదేవుని శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు కనకరాజు, నవీన్, అంజిరెడ్డి, రవి, నర్సింహులు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడు కొమ్మూరిని గెలిపించండి

జనగామ: స్థానికుడు, కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 18వార్డులో సోమవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కోడలు దివ్య ప్రశాంత్‌రెడ్డి, బడికె ఇందిర, కౌన్సిలర్ అనిత వేణుమాధవ్, కాముని జయ, విజయలక్ష్మి, కూకట్ల సుజాత తదితరులు పాల్గొన్నారు. 24వ వార్డులో గడప గడపకు ప్రచారం చేశారు. పాత బీటు బజారు, కురుమవాడ, నాగులకుంట, శివాలయం ఏరియాలో ఆరు గ్యారంటీ స్కీంలపై అవగాహన కల్పిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ప్రతాప్‌రెడ్డితోనే అభివృద్ధి..

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గం అభివృద్ధి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోనే సాధ్యమని ఆయన సోదరి పావనిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో ఇంటింటి ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

గ్రామాల్లో ఇంటింటి ప్రచారం..

మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ కొమ్మూరిని గెలిపించాలని మోడల్ ఈవీఎంలతో ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిమ్మ శ్రావణ్‌కుమార్ రెడ్డి, జంగిటి విద్యానాథ్, ఆరుగొండ పర్శరాములు, సంతోష్‌రెడ్డి, బాలవినయ్, భాస్కర్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, బాలకిషన్, మహాత్మాచారి, రమేష్, మోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



జనగామలో ప్రచారం చేస్తున్న కొమ్మూరి కోడలు దివ్య



పడమటి కేశ్వాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పావనిరెడ్డి

సంక్షిప్త సమాచారం

వాడవాడలా సీపీఎం ప్రచారం



జనగామ: సీపీఎం అభ్యర్థినైన తనకు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే జనగామ పట్టణాన్ని సమగ్రాభివృద్ధి చేస్తానని ఆ పార్టీ అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. పట్టణంలో మిషన్ కంపౌండ్, టీచర్స్ కాలనీ, బాలాజీ నగర్, జ్యోతీ నగర్, గోకుల్ నగర్, అంబేడ్కర్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం నిత్యం ఉద్యమిస్తున్న రైతాంగ ఉద్యమనేతనైన తనకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇర్రి అహల్యా, మహ్మద్ దస్తగిరి, కృష్ణమూర్తి, కల్యాణం లింగం, బాల్నె వెంకటమల్లయ్య, పందిళ్ల కల్యాణి, అంజమ్మ, రజిత, జ్యోతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి గెలుపొంది కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అమిత్‌షా సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేశ్, ఉపాధ్యక్షుడు పెండెం నాగేష్, పోతుల వెంకటేష్, చిమ్ముల నరేందర్‌రెడ్డి, గద్ద రాజు, మహేష్, జలేందర్, చక్రపాణి, నారాయణ, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ కేమిడి భిక్షపతి సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గత కొంత కాలంగా ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తితో ఉన్నారు. పార్టీ మారుతాననే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సీఎం సమక్షంలో చేరడంతో మండలంలోని ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీల్లో ఇద్దరు సిరిపురం ఎంపీటీసీ బర్ల మాధవికుమార్, భిక్షపతి బీఆర్ఎస్‌లో చేరారు.

చిల్పూరు: పల్లగుట్టలో క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్‌రావు సమక్షంలో పార్టీ నాయకులు రత్నాకర్‌రెడ్డి, చిర్ర నాగరాజు, పేరాల సుధాకర్, సంపత్‌రాజు, శ్యాం సుందర్‌రెడ్డి, జయప్రకాష్ ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన తప్పట రాజుతో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.

అఖండ దీపం వెలిగించిన గట్టయ్య



చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ బండ లగట్టు శివగంగేశ్వరి ఆలయ నిర్మాణ దాత, అర్చకుడు వేల్పుల లక్ష్మీగట్టయ్య కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని అరుణాచలంలో అఖండ దీపం వెలిగించారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవుడిని కోరినట్లు తెలిపారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటకు చెందిన బడికె సాయమ్మ మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపించిన ఆర్థిక సాయాన్ని గ్రామ నాయకుడు గూడ సిద్దారెడ్డి సోమవారం అందించారు. నాయకులు ఫిరోజ్, కంసాని మహేందర్ రెడ్డి, జూకంటి కిష్టయ్య, అయిలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'నియంతృత్వ పాలనకు గుణపాఠం తప్పదు'



దేవరుప్పుల: తెలంగాణ సాధన పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం ఆమె సమక్షంలో దేవరుప్పుల, లాకావత్‌తండా(డీ)కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, సీతారాంపురం సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, పులిగిళ్ల యాకన్న, యాకస్వామి, యాకన్న, ఉపసర్పంచ్ బీకోజి, హరియా, నిమ్మ, రాములు, కోటిరామ్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ నసీరుద్దీన్ సోమవారం కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే దళితరత్న అందె చంద్రయ్య కూడా ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ముదిరాజ్‌లకు పూర్వవైభవం

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం హయాంలోనే ముదిరాజ్ కులవృత్తికి పూర్వవైభవం తెచ్చారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. సోమవారం తొర్రూరులో ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపునకు బండా ప్రకాశ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. వృకోధర్‌రెడ్డి, బొందుగుల సోమయ్య, కాశబోయిన మల్లేష్, నగేష్, మధు, సోమశేఖర్, నర్సయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.



సభకు తరలుతున్న ముదిరాజ్‌లు

కులవృత్తుల పరిరక్షణకు బీఆర్ఎస్ కృషి



మాట్లాడుతున్న బక్క నాగరాజు

దేవరుప్పుల : కులవృత్తుల పరిరక్షణకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బక్క నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గొల్ల కురుమలను గుర్తించిన నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. గొల్ల కురుములను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి గొర్రెల పంపిణీ చేపట్టారన్నారు. గొల్ల కురుమలకు రాజకీయంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చి రాజకీయంగా తోడ్పాటు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని తెలిపారు. పాలకుర్తి ప్రాంతాన్ని సమగ్రాభివృద్ధి పథంలో నడిపించిన నిరంతర ప్రజాసేవకుడు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పాలకుర్తి మాజీ ఎంపీపీ వర్రే ఎల్లయ్య, పండుగ నారాయణ, నీలారపు వెంకన్న, సుడిగెల హనుమంతు, చిలువేరు పెంటయ్య, తోటకూరి కృష్ణయ్య, మేకల రమేశ్, కాసాని ఎర్రయ్య, లొడంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడి

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక అభిషేకాలు, అర్చన పూజలు

కార్తీక మాసం మొదటి సోమవారం జిల్లా వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు బారులుదీరారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి, జనగామ పాత బీటు బజారు శ్రీ రామలింగేశ్వరస్వామి, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరస్వామి, చీటకోడూరు పంచకోసు శ్రీ రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి ఉసిరి చెట్టుకింద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరవమ్మను పూజించి వేద పండితుల ఆశీస్సులను తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ అధికారులు అవసరమైన ఏర్పాటు చేశారు.

– జనగామ



నాగేంద్రుడికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. హనుమకొండ కుడా కాలనీలోని ఎస్‌పీఆర్ జూనియర్ కళాశాలలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా సహాయం కోసం వచ్చే మహిళలకు ఉచిత కౌన్సిలింగ్, న్యాయ, పోలీసు, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందించనున్నట్లు వివరించారు. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలు సఖి వన్‌స్టాప్ కేంద్రం ద్వారా సహాయాన్ని పొందాలన్నారు. బాధితులు తక్షణ రక్షణ కోసం 0870 – 2452112, టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. సఖి కేంద్రం కేస్ వర్కర్ వినీల, కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, డైరెక్టర్ సుధాకర్ రావు పాల్గొన్నారు.

తెలంగాణ బాద్‌షా కేసీఆరే..



జనగామ రూరల్: మంగళ హారతులతో పల్లాకు స్వాగతం పలుకుతున్న మహిళలు



జనగామలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి
- కాంగ్రెస్‌కు ఓటువేస్తే కష్టాలు తప్పవు
- జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: గుజరాత్ నుంచి అమిత్ షా, ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వచ్చినా ఈ సారి తెలంగాణ రాష్ట్రానికి బాద్ షా సీఎం కేసీఆరే అని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జనగామ మండలం గానుగుపహాడ్, ఎర్రకుంట తండా, యశ్వంతాపూర్ గ్రామాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పల్లాకు ఊరూరా బోనాలు, బతుకమ్మ, కోలాటంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెసోళ్లు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. 24 గంటల కరెంటు కావాలా.. మూడు గంటలు ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలా ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలో కనిపించే కాంగ్రెస్ నాయకులు చెప్పే కథలను నమ్మొద్దని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన పథకాలు వారు పాలించే రాష్ట్రాల్లో అమలుకు నోచుకోకపోవడంతో ఇక్కడ ప్రజలు వారి మాటలను నమ్మడం లేదని తెలిపారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా బుక్కైన దొంగ రేవంత్ అన్నారు. అనేక మంది అభ్యర్థులకు టికెట్లను అమ్ముకున్న వ్యక్తి అని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు తప్పవన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, పల్లా డ్యాన్స్‌లు చేస్తూ కార్యకర్తలు ఉత్తేజ పరిచారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బచ్చన్నపేట, జనగామ రూరల్, తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీల నుంచి పల్లా సమక్షంలో 300 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పల్లా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మున్సిపల్ కార్మికులతో..

జనగామ పట్టణం రైల్వేస్టేషన్ ఆవరణలో తెల్లవారు జాము పారిశుద్ధ్య కార్మికులను పల్లా కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపరచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి మూడుసార్లు వేతనాలను పెంచినట్లు చెప్పారు. జనగామలో ఈఎస్ఐ ఆస్పత్రి నెలకొల్పడానికి పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి దళితబంధు, గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి పథకాల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల అనంతరం సీఎం కేసీఆర్ నూతనంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ అన్నారు. సోమవారం దూల్మిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తేనే జనగామ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద యాదగిరి, మేక సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, సర్పంచ్ దీపిక వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాచగొని పద్మా వెంకట్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు అరుణ, ఉపసర్పంచ్ మధు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలకు చేరుకున్న పాదయాత్ర..

చేర్యాల(సిద్దిపేట): కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, అలాగే జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండల పరిధిలోని తమ్మడపల్లికి చెందిన యువజన సంఘం నాయకులు 15 మంది కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. సోమవారం పాదయాత్ర పట్టణ కేంద్రానికి చేరుకోగా మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు.

'పల్లా'ను గెలిపించాలి

బచ్చన్నపేట: బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ జాగృతి సాంస్కృతిక సారథి, మండల మాజీ అధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని గోపాల్‌నగర్, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతం మధుప్రసాద్, ఖలీల్‌బేగమ్, లలిత, కవిత, వాణి, నర్సింగ్, స్వరూప, తార, రాజమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.



జనగామలో కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దూల్మిట్టలో ప్రచారం నిర్వహిస్తున్న పల్లా సతీమణి నీలిమ